

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



# సాహిత్యమూ- జంతువులూ- హాస్యమూ

6

**నాకే కాదు, మనలో చాలా మందికి మనకున్నా, లేకున్నా ఉన్న సంపదని డబ్బా కొట్టుకోడానికి ఎప్పుడు టైమూ, ఆడియన్సూ, మరియు మైకూ దొరుకుతాయా అని ఎదురు చూస్తారు.** కానీ నా విషయంలో ఒకసారి అలాంటి అవకాశం వచ్చినప్పుడు నేను అతి తెలివితేటలకి పోయి "ప్రాచీన తెలుగు సాహిత్యంలో హాస్యం కావాలంటే కష్టపడి వెతకాలి" అని నొక్కి వక్కాణించాను. ఆ రోజు నా అదృష్టం బావుండక మిత్రులు, సహస్రావధాని డా. మేడసాని మోహన్‌గారు నా ప్రసంగం వినడానికి వచ్చి మొదటి వరసలో కూర్చున్నారు.

ఎందుకంటే, 1989లో మా హ్యూస్టన్‌లో తానా సభలు జరిగాయి. అప్పుడు సాహిత్య వేదికలో మనం అష్టావధానం కార్యక్రమం పెడదామని సూచించినప్పుడు, ఆనాటి ప్రధాన నిర్వాహకులు వెర్రి మొహం పెట్టారు. ఒకాయన మటుకు "అవునవును, అవధానం చాలా సూపర్‌గా ఉంటది, విఠలాచార్య టైపు, మాయా బజార్ టైపు సినిమాలలో చూశాం కదా" అని తన జ్ఞాన సంపదని డబ్బా కొట్టుకున్నాడు. ఆయన్ని నేను తీవ్రంగా వారించి, అసలు సిసలు అవధానులు సినిమాలలో నటించుట, నర్తించుట చెయ్యరనీ, కేవలం పద్యాలు చెపుతారనీ ఆ నాటి ప్రధాన నిర్వాహకులకి అవధాన ప్రక్రియా, దానికి తెలుగు సాహిత్యంలో ఉన్న విశిష్టతా విడమరిచి చెప్పి ఒప్పించడానికి మా తాతలు దిగి వచ్చారు. ఉత్తర అమెరికాలో మొట్టమొదటి సారిగా జరిగిన ఆ అష్టావధానం చేసినది డా. మేడసాని గారే! ఆ అవధానానికి ఏడుగురు పృచ్ఛకులని వెతికి పట్టుకుని, ఎనిమిదో వాడిగా నేనే అప్రస్తుత ప్రసంగం చేశాను. అప్పటినుంచీ గత ఇరవై ఏళ్ళలో మేడసానిగారు అమెరికా అంతటా చేసిన అనేక అవధానాలకి నేనే అప్రస్తుత ప్రసంగిని. "ఈ మహాశయుడు నన్ను 1989 నుంచీ వేధిస్తూనే ఉన్నాడు" అని ఆయన అన్ని చోట్లా చమత్కరిస్తూ ఉంటారు.

నేనేమో పైన ఉదహరించిన టైమూ, ఆడియన్సూ, మరియు మైకూ కనపడగానే, మేడసాని పండితులు గారు మొదటి వరసలో కూర్చున్నారని గమనించక, ఆవేశంగా పైన ఉదహరించిన "ప్రాచీన తెలుగు సాహిత్యంలో హాస్యం కావాలంటే కష్టపడి వెతకాలి" అని నొక్కి వక్కాణించాను. అంతియునే కాక, "అందువలన పూర్వకాలం కవులకి నవ్వడం తెలుసునేమో కానీ, పద్యాలతో నవ్వించడం తెలియదు" అని కూడా నా అతి తెలివితేటలు ప్రదర్శించాను. అంతే, వెంఠనే అవధానిగారు "ఆపు నీ అప్రస్తుత ప్రసంగం. తెలియకపోతే, తెలియనట్టు ఉండాలి కానీ ఇలాంటి అవాకులూ చెవాకులూ పేల్తావా. అసలు ప్రాచీన సాహిత్యం గురించి తమరికేం తెలుసునూ" అని

డైరెక్ట్‌గా నన్ను తిట్టకుండా, చెయ్యి ఎత్తి నన్ను వారించి, లేచి నుంచున్నారు. ఆ భంగిమకి అర్థం తెలుసుకుని మైకు తాలూకు నిర్వాహకుడు గారు నా ముందు ఉన్న మైకుని తపేమని లాక్కుని, అవధాని గారి ముందు పెట్టుట, నా గొంతు మూగబోవుట జరిగాయి. అప్పుడు ప్రాచీన కావ్యాలలో కూడా చాలా హాస్యం ఉందనీ, అది ఈ కాలప్పిల్లలకి అర్థం అవదనీ అనేక ఉదాహరణలు ఇస్తూ, ఈ క్రింది విషయం చెప్పారు.

అలనాటి శ్రీనాథుడు అడిగిన వెంటనే ఆశువుగా ఏ సమస్యనైనా పూరించగల అసమాన ప్రతిభ కలవాడు. అయినా దేనికైనా ఒక సమయమూ సందర్భమూ ఉండాలి కదా! ఒక రోజు ఆయన చాలా చికాకుగా ఉన్నప్పుడు, రాజసభలో ఒకాయన "అందరు అందరే మరియు నందరు నందరె అందరందరే" అనే సమస్య ఇచ్చి పూరించమన్నాడు. శ్రీనాథుడికి ఒళ్ళు మండి, దాన్ని ఈ క్రింది విధంగా పూరించాడు.

*"కొందరు భైరవాశ్వములు, కొందరు పార్థుని తేరుటెక్కెముల్,*
*కొందరు ప్రాక్కుటీశ్వరులు, కొందరు కాలుని ఎక్కిరింతలున్*
*కొందరు కృష్ణజన్మమున కూసిన వారలు, ఈ సదస్సున*
*అందరు అందరే మరియు నందరు నందరె అందరందరే"*

ఇందులో భైరవాశ్వాములు అంటే కుక్కలు, పార్థుని తేరుఎక్కెముల్ అంటే కోతులు, ప్రాక్కుటీశ్వరుల్ అంటే ఆది వరాహాలు అనగా పందులు, ఇక కృష్ణజన్మమున కూసినవి గాడిదలే కదా! మొత్తం పద్యం తాత్పర్యం ఏమిటంటే, ఆనాటి రాజసభలో ఉన్నవాళ్ళందరూ ఆయా జంతు జాతులకి చెందిన వారు అని ఆ మహాకవి వ్యాఖ్యానం.

మంచి వ్యంగ్యం కానీ హాస్యం కానీ రాయాలంటే, ఎవరి మీదో, దేని మీదో కోపం తెచ్చుకోవాలి అని ఇందులో నాకు అర్థమయిన నీతి. ఇలాటి వాడే కవి చౌడప్ప....చౌడప్ప అనగానే చాలా మందికి ఆయన కేవలం అశ్లీలమైన కవిత్వమే రాశాడని అనుకుంటారు. కానీ ఆయనకి బహుశా ఒక తోటి కవి మీద కోపం వచ్చి ఈ క్రింది పద్యం వ్రాశాడు.

*పెద్దన వలె కృతి చెప్పిన*
*పెద్దన వలె, అల్పకవిని పెద్దనవలెనా*
*ఎద్దనవలె, మొద్దనవలె*
*గెద్దనవలె కుందవరపు కవి చౌడప్పా*

ఇక ఆధునిక సాహిత్యంలోకి వస్తే, కవిత్వంలో హాస్యానికి కూడా ఆద్యులు గురజాడ వారే. ఆయన కన్యాశుల్కం లో "పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్" అని గిరీశం చేత కవిత్వం చెప్పించారు. ఇందులో కూడా ప్రశస్తమైన దున్నపోతుని మహాకవి గురజాడ గారు వ్యంగ్యం కోసం వాడుకున్నారు.

అందుచే వ్యంగ్యమూ, హాస్యమూ రాయాలంటే, అందరినీ జంతువులతో పోలిస్తే చాలు అని నాకు అర్థమయిన మరొక నీతి. ఎందుకంటే, మన కవిత్వం చదివి అవి తిరగబడవు కదా! అదే సేఫ్టీ!

ఏది ఏమైనా, పూర్వకాలం కవులు శృంగారం మీద చూపించినంత శ్రద్ధ హాస్య రసానికి ఇవ్వలేదని నా అభిప్రాయం. అందుకే చాటువులు లాంటి హాస్య రచనలు వేళ్ళ మీద లెక్క పెట్టగలం. శృంగారం ప్రధాన అంశంగా వచ్చిన కావ్యాలు కోకొల్లలు. అందుకే

కాబోలు శృంగారం రాయడం కన్నా హాస్యం రాయడం కష్టం అంటారు సాహితీవేత్తలు.

కానీ రోజులు మారాయి. టెక్నాలజీ మారింది. అందు చేత హాస్యం తరహా కూడా మారింది. ఈ రోజుల్లో హాస్యం రాయాలంటే జంతువుల జోలికి వెళ్ళక్కర లేదు. కట్టుకున్న వాళ్ళమీదా, కంప్యూటర్లూ, సెల్ ఫోన్ల మీదా, సారాబుడ్డి మీదా కూడా హాస్యం రాసెయ్యవచ్చును. అందుకే అన్నాడు మహా కవి శ్రీ శ్రీ "కాదేదీ హాస్యానికి అనర్హం" అని. కానీ శోక రసం కావాలంటే కేవలం ఈ నాటి సినిమా హీరో, హీరోయిన్లనీ, హాస్యగాళ్ళనీ, రాజకీయ నాయకులనీ తల్చుకుంటే చాలు.

తెలుగులో మొట్టమొదటి హాస్య పత్రిక 1922లో బందరు నుంచి ప్రారంభం అయింది అని చరిత్రకారుల అభిప్రాయం. ఆ పత్రికలో ఎంకి పాటలకి పేరడీలు వ్రాస్తూ వోగేటి నరసింహ మూర్తి గారు హాస్యం పండించారు. ఆధునిక వచన కవిత సాహిత్యంలో బాగా హాస్యం పండించిన వారు చాలామంది ఉన్నారు.

**ఉదాహరణకి మహాకవి శ్రీశ్రీ రచించిన "సిప్రాలి" లో రెండు పద్యాలు:**

"మీసాలకి రంగేదో వేసేస్తే
యవ్వనం లభించదు, నిజమే
సీసా లేబుల్ మార్చేస్తే
సారా బ్రాందీ అగునే సిరిసిరి మువ్వా"

"బారెట్లా అయితే మాత్రం సాం
బారెట్లా చేయ గలడు? భార్య ఎదుట
నోరెట్లా మెదలించును
చీరెట్లా బేరమాడు సిరిసిరి మువ్వా"

**అలాగే ఆరుద్ర గారి కూనలమ్మ పదాలలో నాకు నచ్చిన పద్యాలు:**

"తాగుచుండే బుడ్డి
తరుగుచుండే కొద్ది
మెదడు మేయును గడ్డి
ఓ కూనలమ్మా"

"పిలిచినప్పుడు రాదు
వెడలగొట్టిన పోదు
వనిత తీయని చేదు
ఓ కూనలమ్మా"

సెల్ ఫోన్ మీద గుమ్మా సాంబశివ రావుగారి పద్యాలలో మచ్చుకి ఒకటి

"సెల్లు సెట్టు చూడ శ్రేష్టమయి ఉండు
లోన చూడ నన్ని లొసుగులుండు
సెల్లు లందు మంచి సెల్లులు వేరయా
సెల్లు ఫోను తీరు చెప్పతరమా"

సరిగ్గా వెతికితే ఆనాటి కవిత్వం లోనూ, ఈ నాటి వచన కవితలలోనూ హాస్యం పుష్కలంగా దొరుకుతుంది."హాయిగా ఉండేటప్పుడు నవ్వే వాడు సామాన్యుడు. లేనప్పుడు నవ్వే వాడు అసామాన్యుడు. హాయిగా లేని వారిని నవ్వించే వాడు మాన్యుడు" అన్నారు స్వర్గీయ ముళ్ళపూడి వెంకట రమణ. ఎందెందు వెదకి చూచిన అందందే కలదు హాస్యం అంటాను నేను. ఈ రెండు సూత్రాలూ పాటిస్తే అందరూ మాన్యులే!

●●●

Click here to share your comments on this article